క్లుప్తంగా

కేఎంసీ గ్రీవెన్స్‌కు 15 ఫిర్యాదులు



ఫిర్యాదు స్వీకరిస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ)లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో 15 ఫిర్యాదులు అందాయి. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి నగర ప్రజల నుంచి ఫిర్యాదులను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదులు పరిశీలించి, ఆయా విభాగాల అధికారులకు అందజేసి, వాటిని త్వరగా పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు.

తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలి



క్లోరినేషన్ తీరును పరిశీలిస్తున్న ఎంపీఓ

రఘునాథపాలెం: మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసే గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులన్నీ శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ) శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రేగులచలకలో ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేస్తున్న పనులను ఆయన తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ద్వారా అన్ని పంచాయతీల పరిధిలోని ట్యాంకులతో పాటు వాటి పరిసరాలను సైతం శుభ్రం చేయాలని ఆదేశించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

నేలకొండపల్లి: బైక్ అదుపు తప్పి కిందపడడంతో వాహనదారుడికి గాయాలయ్యాయి. మండలంలోని ముజ్జుగూడెంకు చెందిన బొడ్డు సత్యానందం సోమవారం బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. చిరుమర్రి–ముజ్జుగూడెం గ్రామాల మధ్య బైక్ అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఆయనను 108లో ఖమ్మం తరలించారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడి నియామకం



హృదయ్‌కిరణ్

ఖమ్మం సహకారనగర్: యువజన కాంగ్రెస్ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా కొండూరి హృదయ్‌కిరణ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయనను అధ్యక్షుడిగా నియమిస్తూ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ సంఘం, పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని తెలిపారు.

ఏం చేస్తే బాగుంటుంది?

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఇందిరానగర్ జంక్షన్‌లో ఆక్రమణలు, ట్రాఫిక్ సమస్యతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ అంశంపై 'సాక్షి'లో సోమవారం 'జంక్షన్‌లో జాం'శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ట్రాఫిక్ పోలీసులు జంక్షన్‌ను పరిశీలించారు. నిత్యం ప్రమాదాలకు వాహనాల పార్కింగ్, దుకాణాల ఏర్పాటు చేయడమే కారణమని గుర్తించిన వారు ట్రాఫిక్ నిబంధనలు పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	5
వంకాయ	28		20
బెండకాయ	20	పాలకూర	4
పచ్చిమిర్చి	46		20
కాకర	24	చుక్కకూర	4
బోడ కాకర	120		20
బీర	40	తోటకూర	5
దొండ	29		20
పొట్లకాయ	30	గోంగూర	4
చిక్కుడు	56		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	4
క్యాబేజీ	18		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	20		30
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	46		20
క్యాప్సికం	46	-ఖమ్మం వ్యవసాయం	

బీమా తెచ్చిన ధీమా..!

జీపీ వర్కర్లకు రూ.5 లక్షల బీమా ప్రకటించిన ప్రభుత్వం

- అంత్యక్రియల సాయం రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంపు
- పాలేరులో 1,200 మందికి చేకూరనున్న లబ్ధి
- మిగతా డిమాండ్లను నెరవేర్చాలని కార్మికులు డిమాండ్



మురుగు కాల్వను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రంతో పాటు దేశం కూడా అభివృద్ధి చెందుతుంది. అందుకు గ్రామాభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్మికులు, సిబ్బంది కృషి ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఫలితంగా పల్లెలు ఆరోగ్యంగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యాన రైతు బీమా తరహాలోనే వీరికీ రూ.5 లక్షల బీమా చెల్లించేలా ప్రభుత్వం ప్రకటించడంతో కార్మికుల్లో కొంతమేర హర్షం వ్యక్తమవుతోంది.

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో 141 గ్రామపంచాయతీల్లో 18 నుంచి 61 ఏళ్ల వయస్సు ఉన్న దాదాపు 1,200 మంది మల్టీ పర్పస్ వర్కర్లు పని చేస్తున్నారు. కాగా, కొన్ని పంచాయతీల్లో మాత్రం సొంతంగా కార్మికులను నియమించుకుని ప్రతి నెలా రూ.9,500 చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. ఈనేపథ్యాన ఏదైనా కారణం చేత కార్మికుడు మృతి చెందితే కుటుంబానికి రూ.5 లక్షలు బీమా డబ్బులను అందించేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు కార్మికుల వివరాలను అందించాలని ప్రభుత్వం ఆదేశించటంతో పంచాయతీ కార్యదర్శులు యుద్ధ ప్రాతిపదికన ఆరా తీసి నివేదికను పంపించారు. అదే విధంగా అంత్యక్రియలకు అందించే రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు పెంచుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు ప్రభుత్వం విధి విధినాలపై కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది.

డిమాండ్ల పరిష్కారం లేనట్టేనా..?

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు 35 రోజుల పాటు రిలే దీక్షలు చేపట్టారు. కానీ ప్రభుత్వం వారి డిమాండ్ల పట్ల స్పష్టమైన నిర్ణయం తెలపకపోవడంతో కార్మికుల మధ్య అసంతృప్తి నెలకొంది. కాగా, ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బీమా సౌకర్యం కొంత ఉపశమనం కలిగించినా.. గతంలో మృతి చెందిన కార్మికులకు వర్తించపోవడంతో కొందరు నిరాశకు గురయ్యారు. ప్రభుత్వం విధి విధానాల్లో వీరిని కూడా చేర్చాలని కార్మికులు కోరుతున్నారు.



సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు(ఫైల్)

సానుకూలంగా స్పందించాలి..



మా న్యాయమైన డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. 35 రోజుల పాటు నిరవధిక సమ్మె చేశాం. ప్రభుత్వం మా డిమాండ్లను పరిష్కరించాలి. వేతనాలు పెంచి వెంటనే అమలు చేయాలి.

– వంగూరి నాగరాజు, మల్టీపర్పస్ వర్కర్, గువ్వలగూడెం

సమ్మె వేతనాలు చెల్లించాలి..



సమ్మెలో కార్మికులు పాల్గొన్నప్పుడు అందించే వేతనాలను వెంటనే ఇవ్వాలి. బీమా సౌకర్యం మంచిదే అయినా డిమాండ్ల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోంది. కార్మికులపై ప్రభుత్వం తీరు మార్చుకోవాలి.

– పగిడికత్తుల నాగేశ్వరరావు, సీటు నాయకుడు, నేలకొండపల్లి

గొర్రెలు పంపిణీ చేయాలని వినతి



వినతి పత్రం అందిస్తున్న సంఘం నాయకులు

నేలకొండపల్లి/కూసుమంచి: గొర్రెల యూనిట్ల కోసం డీడీలు కట్టిన ప్రతి ఒక్కరికీ ఎలాంటి అక్రమాలకు తావులేకుండా గొర్రెలు, మేకలు పంపిణీ చేయాలని జీపీఎంఎస్ జిల్లా కార్యదర్శి తుశాకుల లింగయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఈమేరకు ఎంపీడీఓ జమలారెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ.. డీడీలు తీసి 14 నెలలు అవుతున్నా.. నేటికీ యాదవులు, కురమలకు యూనిట్లను అందించకపోవడం దారుణం అన్నారు. దళిత బంధు, బీసీ బంధు పథకాలకు లేని వాటా ధనం యాదవులు, కురమలు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించారు. మునుగోడులో ఇచ్చిన హామీ మేరకు నగదు బదిలీ రూపంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పథకం పక్కదారి పట్టకుండా అధికారులు నిఘా ఉంచాలని, దళారుల ప్రమేయాన్ని అరికట్టాలని కోరారు. ఈ విషయమై ఈ నెల 22న చలో ఖమ్మం కలెక్టరేట్ ముట్టడి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు యడ్ల తిరపతిరావు, జిల్లా డైరెక్టర్ మల్లెబోయిన శ్రీనివాసరావు, నాయకులు నరసింహారావు, చిలకల భూషయ్య, వలరాజు, గడ్డం గంగయ్య, కోటయ్య, మురళి, మార్తి కొండలరావు, కిరణ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నేడు గణేశ్ మండప నిర్వాహకుల సమావేశం

ఖమ్మంగాంధీచౌక్: వినాయక చవితిని పురస్కరించుకుని ఖమ్మంలో విగ్రహాలు ఏర్పాటు చేయనున్న గణేశ్ మండపాల నిర్వాహకులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసినట్లు స్తంభాద్రి ఉత్సవ సమితి అధ్యక్షుడు వినోద్ లాహోటి వెల్లడించారు. నగరంలోని సమితి కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం నిర్వహించాల్సిన నిర్వాహకుల సమావేశాన్ని మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు గాంధీచౌక్‌లోని వర్తక సంఘ భవనంలో జరిగే సమావేశానికి హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో సమితి ప్రధాన కార్యదర్శి కీసన జపాల్‌రెడ్డితో పాటు ప్రసన్నకృష్ణ, గెంటెల విద్యాసాగర్, మూలగుండ్ల శ్రీహరి, అల్లిక అంజయ్య, డొలే సాయికిరణ్, పాలడుగు పాపారావు, ఈశ్వర ప్రగడ రామారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మంరూరల్: ప్రజా సమస్యలు పరిష్కరించాలని, అధిక ధరలను నియంత్రించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యాన సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఇష్టానుసారంగా ధరలు పెంచుకుంటూ పోతుండడంతో పేద, మధ్య తరగతి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వి.సుదర్శన్‌రెడ్డి, వి.నాగేశ్వరరావు, రామయ్య, ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 'గృహలక్ష్మి' అమలు చేయాలి

కూసుమంచి: అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకాన్ని అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎడవెల్లి రమణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు తహసీల్దార్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు ముగిసినప్పటికీ ఇంత వరకు పథకం అమలు కాలేదని, వెంటనే అర్హులను గుర్తించి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను ప్రభుత్వాలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గురుమూర్తి, రాజు, హన్మంతరావు, శ్రీను, వెంకన్న, గన్యానాయక్, కర్ణబాబు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణా కేంద్రం ప్రారంభం

ఖమ్మంమయూరిసెంటర్: బోడేపూడి విజ్ఞాన కేంద్రం(బీవీకే) ఆధ్వర్యాన ఖమ్మం సుందరయ్య భవనంలో వాసిరెడ్డి శేషయ్య, మంగమ్మ మెమోరియల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ప్రారంభించారు. బీవీకే జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తమ్మినేని మాట్లాడుతూ బోడేపూడి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన చేపడుతున్న సేవా కార్యక్రమాల కొనసాగింపులో భాగంగా ఈ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కేంద్రాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, వాసిరెడ్డి దయానంద్, సీపీఎం నాయకులు ఎం.సుబ్బారావు, బండి రమేష్, వై.విక్రమ్, బండి పద్మ, నందిపాటి మనోహర్, ఎర్ర శ్రీనివాసరావు, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తమ్మినేని


బతుకమ్మలతో వినూత్న నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నాచౌక్‌లో నిరసన కార్యక్రమాల్లో భాగంగా 8వ రోజైన సోమవారం బతుకమ్మలతో వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం బాధ్యులు షేక్.మహబూబ్ పాషా, వీరస్వామిలు మాట్లాడుతూ.. విద్యాశాఖలో సమగ్ర శిక్ష జేఏసీ పరిధిలోని సీఆర్పీలు, సీసీఓలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, మెసేంజర్లు కలిసి ఉద్యోగ భద్రత, మినిమం టైం స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈఓ సోమశేఖర శర్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రవి, నాగరాజు, సైదమ్మ, తిరుపయ్య, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు హెల్త్ కార్డులు అందజేత



హెల్త్ కార్డులు అందుకుంటున్న పాస్టర్లు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు వెగ్గళం ఇమ్మానుయేల్ ఆధ్వర్యాన పాస్టర్లకు పువ్వాడ ఉదయనగర్ పాస్టర్ సురేష్ చర్చిలో సోమవారం పువ్వాడ ఫౌండేషన్ హెల్త్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా పాస్టర్ కరుణాకర్, చైర్మన్ మంద సంజీవరావు, సెక్రెటరీ నల్ల గట్ల లాజరు మాట్లాడుతూ.. హెల్త్ కార్డుల ద్వారా ఉచిత వైద్యం పొందొచ్చని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ కూరపాటి సామెల్, ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్, గౌరవ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహాసేన ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పసలపూడి రమేష్, ఎల్.జయరాజ్, మాజీ అధ్యక్షుడు నందిపాటి అభిషేక్, ఆర్.జయరాజ్, జోసఫ్ నాయక్, త్యాగరాజు, యోసేపులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన అధినేతను కలిసిన ఖమ్మం అసెంబ్లీ ఇన్‌చార్జ్

ఖమ్మం మామిళ్లగూడెం: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ మిరియాల రామకృష్ణ ఈ మేరకు ఏపీలోని మంగళగిరి పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మం నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాలపై పవన్ ఆరా తీసి పలు సూచనలు చేశారు.

ఖమ్మంను మరింతగా తీర్చిదిద్దుతా..

ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: వచ్చే ఎన్నికల్లోనూ తనను గెలిపిస్తే ఖమ్మంను మరింత అద్భుతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఖమ్మం 41వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తన తండ్రితో పాటు తాను సైతం ఖమ్మం అభివృద్ధిపైనే ఆలోచనలు చేశామన్నారు. స్వచ్ఛమైన రాజకీయాలు చేస్తూ, రాజకీయాలకు కుటుంబ సభ్యులను దూరంగా ఉంచానని తెలిపారు. 75 ఏళ్లలో కాంగ్రెస్, టీడీపీ పాలనలో ఖమ్మంకు మంత్రి పదవి రాలేదని, ఇప్పుడు మంత్రిగా పనిచేసే అవకాశం రావడంతో అన్నిరకాలుగా అభివృద్ధి చేశానని చెప్పారు. అయితే, ప్రజలు మరోమారు అవకాశం ఇస్తేనే ఖమ్మం అభివృద్ధి కొనసాగుతుందని ఆయన తెలిపారు. కాగా, రావూరి అనిల్–సమత ఆధ్వర్యాన జరిగిన ఈ సమ్మేళనంలో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, బీ.జీ.క్లైమెంట్, నున్నా అప్పారావు, గరికపాటి వెంకటేశ్వరరావు, వల్లభనేని రామారావు, నెల్లూరి చంద్రయ్య, యల్లంపల్లి నారాయణ, రామానుజస్వామి, తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఇరువురు కుటుంబాలను పాలేరు శాసన సభ్యుడు కందాళ ఉపేందర్‌రెడ్డి పరామర్శించారు. సోమవారం ఈమేరకు ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. అదే విధంగా మండలంలో ఎమ్మెల్యే కందాళ కుమార్తె పలు కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయమందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చెరువుమాధారంలో నివాళులర్పించాక పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

బోగస్ ఓట్లపై ఎన్నికల సంఘాలకు ఫిర్యాదు

ఖమ్మంమయూరిసెంటర్: బోగస్ ఓట్లపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు మువ్వా విజయబాబు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 42వ డివిజన్, రఘునాథపాలెం మండలం రాంక్యాతండాలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఖమ్మం నియోజకవర్గంలో దొంగ ఓట్లతో గెలవాలని చూస్తున్నారని, నేడో రేపో రానున్న ఓటర్ల సమగ్ర జాబితాను పరిశీలించి దొంగ ఓట్లు ఉన్నట్లు తేలితే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మలీదు జగన్, ఎం.డీ. ముస్తాఫా, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ చైర్మన్ బాణాల లక్ష్మణ్, మైనారిటీ నాయకులు షేక్ ఇమామ్, దుంపల రవి కుమార్, బోడా శ్రావణ్ కుమార్, చింతమళ్ల గురుమూర్తి, కీసర పద్మజారెడ్డి, శ్రీ కళా రెడ్డి, నరసింహారావు, కాంపాటి వెంకన్న, రాము తదితరులు పాల్గొన్నారు.



షాపు నిర్వాహకుడితో మాట్లాడుతున్న మువ్వా విజయబాబు

'ప్రియదర్శిని'లో మెంటార్ టుగెదర్

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం విద్యార్థినులకు బెంగుళూరుకు చెందిన టాస్క్ ఆధ్వర్యాన మెంటార్ టుగెదర్ సంస్థ బాధ్యులు ప్రతిభాపాటవాలపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి అభిలాష్ మాట్లాడుతూ.. విద్యార్థులను ఉద్యోగ సాధనకు తీర్చిదిద్దడమే తమ సంస్థ విధి అని తెలిపారు. కాగా, విద్యార్థినులకు గోల్స్, పరిశ్రమలపై అవగాహన, టెక్నికల్ స్కిల్స్ తదితర వాటిపై ట్రైనింగ్ నిర్వహించగా.. ప్రతిభ చూపిన వారికిఉచితంగా ఎంఎన్‌సీలలో అనుభవజ్ఞులైన నిపుణులచే శిక్షణ ఇచ్చి ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు మాట్లాడుతూ.. ఇటువంటి కార్యక్రమాల ద్వారా వ్యక్తిగత నైపుణ్యాలను మెరుగు పర్చుకోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ బి.గోపాల్, డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



నివాళులర్పిస్తున్న వనజీవి రామయ్య

ఖమ్మంరూరల్: మండలంలోని రెడ్డిపల్లికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య తన స్వగృహంలో అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం హైదరాబాద్‌లో బీట్ ఆఫీసర్లుగా శిక్షణ పొందుతున్న 33 మంది రామయ్య ఇంటికి వచ్చి అక్కడ సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రామయ్య విధి నిర్వహణలో అమరులైన అటవీశాఖ సిబ్బంది చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామయ్య మాట్లాడుతూ.. అటవీశాఖ ఉద్యోగులు తమ విధిలో భాగంగా ఎన్నో అవాంతరాలను ఎదుర్కొంటూ ఉంటారని వారి సేవలు మరువలేనివని తెలిపారు. అంతేకాక ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యాన సోమవారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చింత్రాల నాగభూషణం మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు అవుతున్నా ఇంతవరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా 18 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పగిడిపల్లి బాబు, వీరభద్రం, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న నాయకులు

మహా ధర్నా పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరణ చేస్తున్న నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న ఇందిరపార్కు వద్ద జరిగే మహా ధర్నా పోస్టర్లను సోమవారం ఖమ్మం మంచికంటి భవన్‌లో ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోడపట్ల సుదర్శన్, గాలి అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మేకపోతుల వెంకటరమణ, బెల్లం కొండ వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారు తాళ్లు ఎక్కే క్రమంలో ప్రమాదానికి గురవుతున్నారని, వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గీతన్నలకు బైకులు ఇవ్వాలని, బడ్జెట్‌లో గీత కార్మికులకు కేటాయించిన డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పగడాల నాగేశ్వరావు, కల్లుగీత సంఘ నాయకులు కరుణాకర్, శ్రీను, ఉపేందర్, వెంకటరావు, ఉప్పలయ్య, వెంకటనారాయణ, నాగేశ్వరావు, రమేష్, మారగాని నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.